



చినలంక వద్ద నిలిచిన బోట్లు

సముద్రంలో వేట నిషేధం

నరసాపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో సముద్రం అల్ల కల్లోలంగా మారింది. ఈదురుగాలులకు కెరటాలు ఎగసిపడుతున్నాయి. నరసాపురం మండలం చినలంక, పీఎం లంక, పేరుపాలెం, కేపీపాలెం వద్ద సముద్రం ఉధృతంగా కనిపిస్తోంది. అల్పపీడనం హెచ్చరికతో మత్స్యశాఖ అధికారులు ఈనెల 22 వరకు వేట నిషేధ ఆజ్ఞలు జారీ చేశారు. ఇప్పటికే వేటకు వెళ్లిన బోట్లన్నీ తీరానికి చేరుకుంటున్నాయి. కొన్ని నరసాపురం వద్దకు రాగా మరికొన్ని అంతర్వేదిలో ఆగాయి. ఇంకా సముద్రంలో ఉన్న బోట్లను వెనక్కి రప్పిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్ చెప్పారు. వాతావరణ పరిస్థితులను బట్టి అవసరమైతే నిషేధం మరికొన్ని రోజులు పొడిగిస్తామన్నారు.

వరద విలయం



ఉధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు

వేలేరుపాడు సమీపంలో పెదవాగు ప్రాజెక్టుకు గండిపడిన దృశ్యం

- వేలేరుపాడును ముంచేసిన పెద వాగు
- మొరాయించిన మూడో గేటు.. భారీ గండి
- గుట్టలెక్కి ప్రాణాలు కాపాడుకున్న జనం
- సర్వం కోల్పోయిన కమ్మరిగూడెం
- ఇంటిలోని సామగ్రి వరద పాలు
- కట్టు బట్టలతో మిగిలిన ప్రజలు
- వందలాది పశువులు మృత్యువాత
- కూలిన ఇళ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు
- 36 గంటలకుగా నిలిచిన విద్యుత్



మాధవరంలో ఎర్రకాల్వ వరద నీటిలో వరిచేలు

ఏలూరు/వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి సమీపంలోని పెద్ద వాగుకు సంభవించిన భారీ వరదతో వేలేరుపాడు అతలాకుతలమైంది. గురువారం ఎగువ భాగం నుంచి భారీగా వరదనీరు ప్రాజెక్టులోకి చేరడం ఒక ఎత్తైతే, ఈ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేసేందుకు మూడు గేట్లలో ఒకటి పైకి లేవకుండా మొరాయించడం.. ఈ కారణంగానే వరద నీరు కిందికి చేరడంలో ఆటంకం ఏర్పడి గండికి దారితీసింది. గురువారం మధ్యాహ్నం నుంచి వరద నీరు ప్రాజెక్టు కట్టల మీదుగా దిగువకు పారడం ఆరంభమైంది. ప్రాజెక్టుకు ఎడమ భాగాన, క్రస్ట్ గేటుకు పక్కన వరద ఉధృతికి గట్టు తట్టుకోలేక క్రమేపీ గండికి దారితీసింది. దీంతో వరద నీరంతా దిగువకు దూసుకుపోవడంతో 15 గ్రామాలకు పైనే నష్టాన్ని చవిచూశాయి. ఒంటిబండ, ఊటగుంపు, మేడేపల్లి గ్రామాల్లోని ఇళ్ళలోకి వరదనీరు దూసుకొచ్చింది. దీంతో పూరి గుడిసెలు నేలమట్టమయ్యాయి. ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని గుట్టపైకి పారిపోయి, తలదాచుకున్నారు. రాత్రంతా చిమ్మ చీకటిలోనే గడిపారు. అల్లూరినగర్, రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర రహదారి ధ్వంసమైంది. రెడ్డిగూడెం - వసంతవాడ మధ్య మరో కిలోమీటరు మేర మార్గంలో ఇదే పరిస్థితి. ఇక్కడ ఐదిళ్లు ధ్వంసమయ్యాయి. పెద్దవాగు కారణంగా సుమారు 15 గ్రామాల్లో 70 శాతంపైగా ఇళ్ళు పాక్షికంగాకానీ, పూర్తిగా కాని దెబ్బతిన్నాయి. ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు చాలాకాలం పట్టే అవకాశం ఉంది.

పశువులు మృత్యువాత

భారీ వరదకు ఆయా గ్రామాల్లోని వందలాది పశువులు మృత్యువాత పడ్డాయి. మరెన్నో కొట్టుకుపోయాయి. గ్రామాల్లోని ఇళ్ళ వద్ద కట్టేసిన పశువులు తప్పించుకునే వీలులేక ఎక్కడికక్కడ మృతి చెందాయి. పూచిరాల గ్రామంలో ఒక చెట్టుకు జంటెద్దులు చిక్కుకుని వరదలో మునిగిపోయి మరణించగా నాళ్ళవరం కాలనీ సమీపంలో కొండవాగు పొర్లడంతో మేతకు వెళ్ళిన పశువులు వరదలో కొట్టుకుపోయి సమీపంలో ఉన్న గోదావరిలోకి వెళ్ళిపోయాయి. వీటి ఆచూకి ఇంత వరకు లభించకపోవడంతో రైతులు వెతుకుతున్నారు.

ధ్వంసమైన రోడ్లు

పెద్ద వాగు మహోగ్ర రూపానికి వేలేరుపాడు మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లోని అంతర్గత రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. మండలవ్యాప్తంగా రహదారులు వంతెనలు, దెబ్బ తినడంతో వేలేరుపాడుకు చుట్టుపక్కల గ్రామాలతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. వేలేరుపాడు, అశ్వారావుపేట ఆర్అండ్‌బీ రహదారిపై 5 కిలోమీటర్ల మేర భారీగా గండ్లు పడటంతో వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోయింది. ఈ మండలానికి పాలు, గ్యాస్, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తుంటారు. రోడ్లు దారుణంగా దెబ్బ తినడంతో వాహనాలు వచ్చే పరిస్థితి లేక సరుకుల సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గండ్లుపడ్డ రహదారులను ఎంత త్వరగా బాగుచేయాలన్న కనీసం వారం రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు. అప్పటి వరకు పరిస్థితి ఇలానే ఉంటే ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

కమ్మరిగూడెం విలవిల

పెద్ద వాగు ప్రాజెక్టుకు కూత వేటు దూరంలోని కమ్మరిగూడెం గ్రామంపైకి మృత్యువులా వరద వచ్చి పడటంతో గ్రామానికి చెందిన ప్రజలు సమీపంలోని గుట్టలపైకి చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. కట్టుబట్టలతోనే పరుగులు తీయడంతో ఇళ్ళలోని సామగ్రితో పాటు గ్రామంలోని పశువులు, కోళ్ళు, పెంపుడు జంతువులు మొత్తం వరదలో కొట్టుకుపోయాయి. తీవ్రమైన వరద దాటికి గ్రామంలోని పక్కా ఇళ్ళు తప్ప పూరిళ్ళు మొత్తం కుప్పకూలిపోయాయి. సర్వస్వం వరద పాలు కావడంతో ఆ గ్రామంలోని ప్రజలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. టీవీలు, ఫ్రిడ్జ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ సామాన్లు మొత్తం వరదకు తడిచిపోవడంతో ఎందుకు పనికి రాకుండా పోవడంతో ఇంతకాలంగా కష్టపడి సంపాదించుకున్న సొమ్ములతో కొనుక్కున్న వస్తువులన్నీ వరదపాలు కావడంతో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వీటితో పాటు ఇళ్ళల్లో నిల్వ చేసుకున్న బియ్యం, వడ్లు, ఇతర ధాన్యాలు సర్వం వరదపాలు కావడంతో వారంతా ఆపన్న హస్తాల కోసం ఎదురు చూస్తున్నారు.

దటీజ్ ..వెట్రిసెల్వి

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ పెద్దవాగు ప్రాజెక్టు వరదల్లో భారీగా దెబ్బ తిన్న గ్రామాల్లో శుక్రవారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ లావణ్యవేణితో కలిసి రోజంతా పర్యటించారు. వరద ఉధృతికి రోడ్లన్నీ కొట్టుకుపోవడంతో వాహనాలు వెళ్ళే పరిస్థితి లేకపోయినా కొంతలో కొంత సాహసించి అల్లూరి నగర్‌తో పాటు మరికొన్ని గ్రామాల్లోనూ పర్యటించారు. బాధితులను కలిసి భయం లేదు.. మేము న్నామంటూ భరోసా ఇచ్చారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉన్నందున తక్షణం సహాయ కేంద్రాలకు రావాల్సిందిగా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడికక్కడ వరద కారణంగా తాము ఎలా నష్టపోయింది స్థానికులు వివరించినప్పుడు కలెక్టర్ సావధానంగా ఆలకిస్తూనే మీకెలాంటి లోటు రానివ్వం అంటూ సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆయా గ్రామాలన్నింటిలోనూ ఎలాంటి సహాయ చర్యలు తీసుకుంటున్నది అడిగి తెలుసుకున్నారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిన ప్రాంతానికి తన గన్‌మేన్ సాయంతో ప్రమాదభరిత మార్గంలో బైక్ మీద ప్రయాణించారు. ప్రాజెక్టుకు ఎక్కడ గండి పడిందో స్వయంగా చూశారు. వివిధ గ్రామాల్లోని నిండు గర్భిణులు, బాలింతలను వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సురక్షితంగా చేరవేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు ఆహారం అందని గ్రామస్తులకు వెను వెంటనే మండల కేంద్రంలోనే భోజనాలు వండించి పంపించారు. నిలిచిన విద్యుత్ సరఫరా పునరుద్దరణకు అధికారులను ఆగమేఘాల మీద రంగంలోకి దింపారు. పర్యటనలో తన వెంట వున్న ఐటీడీఏ అధికారులకు, స్థానిక అధికారులకు ఎక్కడికక్కడ తక్షణ ఆదేశాలు ఇచ్చారు. దీంతో వరద ఉధృతికి ఒరిగిన స్థంభాలను శుక్రవారం సాయంత్రానికే కొన్నింటిని యథాస్థానంలో నిలుపగలిగారు.



మాధవరం వద్ద రోడ్డుపై నుంచి వరద నీరు

నేడు పాఠశాలలకు సెలవు

భీమవరం ఎడ్యుకేషన్ : వర్షాల కారణంగా శనివారం అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో నాగమణి తెలిపారు. వర్షాలు తగ్గిన వెంటనే సూళ్లలో పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత సెలవు రోజును తదుపరి ప్రభుత్వ సెలవు రోజున పాఠశాలలు నిర్వహించాలని ఆదేశించారు.

కొట్టుకుపోయిన రహదారులు

పెద్ద వాగు కాల్వ ఉధృతికి కుక్కునూరు-లచ్చిగూడెం ప్రధాన రహదారి కొట్టుకుపోవడంతో భారీ గండి పడింది. రెండుచోట్ల ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కుక్కునూరు-దాచారం అర్అండ్‌బీ ప్రధాన రహదారి గుండేటి వాగు వరద నీటికి కోతకు గురైంది. కుక్కునూరు-దాచారం మధ్య ఉన్న గుండేటి వాగులో లెవల్ కాజ్ వేకు ఇరువైపులా అప్రోచ్ కొట్టుకు పోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు-అశ్వారావుపేట ప్రధాన రహదారంతా వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో ప్రజలు ఈ రహదారిపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిగూడెంలో పాత వాగు ఉధృతికి పలు ఇళ్లు నీట మునిగాయి. దీంతో వారిని సమీప పాఠశాల భవనంలో పునరావాసం కల్పించి రెవెన్యూ అధికారులు భోజన సదుపాయం కల్పించారు. భారీ వర్షాలకు మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గడిచిన 24 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓ వైపు భద్రాచలంలో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తాహసీల్దార్ అచ్యుతకుమారి కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబర్ 83097 03949కి ఫోన్ చేయాలని సూచించారు.

నేలకొరిగిన 17 విద్యుత్ స్తంభాలు

కుక్కునూరు, వేలేరుపాడు మధ్య గుల్లవాయి వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తీగలు తెగిపడ్డాయి. శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్ పునరుద్దరణ చర్యలు చేపట్టారు. తిరిగి విద్యుత్ పోల్స్ ఏర్పాటుచేసి సరఫరా చేస్తున్నారు. కుక్కునూరు మండలంలో దాదాపు 35 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఎర్రకాల్వ ముంచేసింది..

జిల్లాలో రెండు రోజులుగా ఏకధాటిగా వర్షం కురవడంతో పలుపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సార్వా నారుమడులు నిండా మునిగాయి. జిల్లాలో 15,485 ఎకరాలలో నాట్లు ముంపునకు గురవగా 1,240 ఎకరాల్లో నారుమడులను వర్షపునీరు ముంచేసింది. ఇప్పటికే నాట్లు వేసిన వరిచేలకు ఎకరానికి రూ.10 వేలు వరకు పెట్టుబడి అయింది. వర్షాలతో పనికిరాకుండా దెబ్బతింటే నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

- గ్రామాల్లోకి వరదనీరు
- జగన్నాథపురంలో పునరావాస కేంద్రం
- జిల్లాలో 15,485 ఎకరాల్లో నారుమడులు, 1240 ఎకరాల్లో నాట్లు మునక

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 19: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎర్రకాలువ తాడేపల్లిగూడెం మండల రైతులను నిండా ముంచింది. మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల, జగన్నాదపురం, మాదవరం, అప్పారావుపేట, పట్టింపాలెం, వీరంపాలెం గ్రామాల్లో 7,500 ఎకరాల్లో వరిపంట నీటిలో నానుతోంది. వేలాది రూపాయలు వెచ్చించి నాట్లు వేసిన వరిపంటకు ఆదిలోనే ఈ వరద ముప్పు రావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనికితోడు ఎగువ నుంచి వరద నీరు ప్రవాహంలా వస్తుండటంతో పంట చేలను దాటి వరదనీరు గ్రామాలను తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే నందమూరు అక్విడెక్టు వద్ద నీటిమట్టం 34.7 అడుగులకు చేరుకోగా ఇరిగేషన్ అధికారులు 32 అడుగుల వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఎగరవేయగా ఎగువన కొంగువారిగూడెం వద్ద 16 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో ఎర్రకాలువ పరివాహక గ్రామాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ నాగరాణి నందమూరు అక్విడెక్టు ప్రాంతాన్ని పరిశీలించి పంటనష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఎర్రకాలువ వరద నీరు జగన్నాదపురం గ్రామానికి తాకడంతో 30 కుటుంబాలు ముంపు బారిన పడ్డాయి. దీంతో 70 మందిని గ్రామంలోనే సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆ పునరావాస కేంద్రంలో బాధితులకు ఇప్పటికే ప్రభుత్వ సహాయం అందిస్తున్నారు.



ముందస్తు చర్యలు చేపట్టాలి : కలెక్టర్ నాగరాణి

తణుకు : ఎర్రకాలువ ఉధృతి వల్ల దువ్వ వయ్యేరు కాలువకు వరద పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం దువ్వ, కోనాల, ముద్దాపురం గ్రామాలకు చెందిన ఏటిగట్లను, వరిపొలాలను, యనమదుర్రు డ్రెయిన్, తిరుపతిపురం, మీనవల్లూరు లాకులను పరిశీలించారు. గట్లు పటిష్టతకు ఇసుక బస్తాలుతో బలపర్చాలని అధికారలను ఆదేశించారు. వయ్యేరు కాలువ వద్ద పూరి పాకల్లో నివాసం ఉంటున్న 44 కుటుంబాలను పక్కనే ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాలుకు తరలించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు సీఎం చంద్రబాబుకు కలెక్టర్ వివరించారు.శుక్రవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్షించారు.ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫ్లడ్ మాన్యువల్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.



వరద నీటిలో కోట సత్తెమ్మ ఆలయం

నిడదవోలు : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయంలోకి వరదనీరు ప్రవేశించింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ వరదనీరు దిగువకు విడుదల చేయడంతో అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న కల్వర్టు ద్వారా అమ్మవారి గర్భాలయం వరకు నీరు చేరింది ఆలయ అధికార్లు ఆలయం లోపల నీటిని మోటార్ల ద్వారా బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ఎప్పుడు పొంగి ప్రవహించినా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశిస్తుందని, సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

పాలకొల్లులో అత్యధిక వర్షపాతం 123 మి.మీ

భీమవరం టౌన్ : వర్షాలకు అత్యధికంగా పాలకొల్లులో 123.6 మి.మీ వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెం, పెంటపాడుల్లో 113 మిమీ, తణుకులో 112.8 మి.మీ అత్తిలిలో 78.6, గణపవరం 106.4, ఆకివీడు 58.2,ఉండి 82.6, పాలకోడేరు 79.4, పెనుమంట్ర 100.6, ఇరగవరం 94, పెనుగొండ 72.4, ఆచంట 82.4, పోడూరు 94.4, వీరవాసరం 65.6, భీమవరం 88.6, కాళ్ళ 51.6, మొగల్తూరు 71.4, నరసాపురం మండలంలో 84.6 మి.మీ నమోదైంది.



పాలకోడేరు-గొల్లలకోడేరు యనమదుర్రు డ్రైన్ బ్రిడ్జిపై గోతులు



మొగల్తూరులో నారుమడుల్లో నీరు తోడుతున్న రైతులు



నరసాపురం లాకుపేటలో పరిశీలిస్తున్న బొమ్మిడి, పాత్తూరి



జగన్నాథపురం పునరావాస కేంద్రంలో వద్ద వరద బాధితులు

ఇన్‌చార్జ్ వస్తారా ?

- ఉద్యాన విశ్వవిద్యాలయంలో స్తంభించిన పాలన
- వైస్ చాన్సలర్ కోసం ఎదురుచూపు
- ఇతర వర్సిటీలకు ఇన్‌చార్జ్‌ల నియామకం
- వెంకట్రామన్నగూడెంపై కసరత్తు జరుగుతోందా ?

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం దేశంలో రెండోది అంటూ గొప్పలు చెప్పుకోవడానికి పరిమితమైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో యూనివర్శిటీ పూర్తిగా దెబ్బతింది. విశ్వవిద్యాలయ అధికారుల నియామకంలో నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారు. వైస్ చాన్సలర్ నియామకాన్ని హైకోర్టు రద్దు చేసిందంటే వైసీపీ ప్రభుత్వంలో ఎంతలా దిగజారిపోయిందో అర్థమవుతోంది. నియామకాలన్నీ ఏకపక్షంగా సాగాయి. వైస్ చాన్సలర్ వైఖరిపైనా ఉద్యోగ వర్గాల్లో పూర్తి వ్యతిరేకత వ్యక్తమైంది. హైకోర్టు తీర్పు తర్వాత కూడా వైస్ చాన్సలర్‌గా డాక్టర్ టి.జానకి రామ్ తన పదవి నుంచి తప్పుకోలేదు. చివరకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. విశ్వ విద్యాలయానికి ఎందుకు వెళుతున్నారంటూ ప్రభుత్వ అధికారులు ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఫోన్ వచ్చిన తర్వాత డాక్టర్ జానకిరామ్ రాజీనామా చేశారు. అయితే కొత్త వైస్‌చాన్సలర్ నియామకం పూర్తయ్యేవరకు ఇన్‌ఛార్జ్‌ను నియమించాలి. అంతర్గతంగా విశ్వవిద్యాలయ అధికారులను ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తే 15 రోజుల వరకు మాత్రమే పదవీ కాలం ఉంటుంది. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలు వేరు. ఉద్యాన విశ్వవిద్యాలయం వేరు. బయట వారికే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలి. ఉద్యానవన కోర్సులు, సాగుకు సంబంధించి పరిజ్ఞానం ఉండాలి. ఉద్యాన రంగంలో అనుభవం ఉన్న వ్యక్తులనే ఇన్‌ఛార్జ్‌లుగా నియమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్ బాధ్యతలను కూటమి ప్రభుత్వం ఎవరికీ అప్పగించలేదు. కీలకమైన వీసీ పదవిలో ఇన్‌ఛార్జ్ కోసం ఎదురు చూస్తున్నాయి. గతంలో వైస్ చాన్సలర్ పదవీ కాలం ముగిసినట్టయితే రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ లేదా కార్యదర్శులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించేవారు.

ఈ ఐదేళ్లలో ప్రాజెక్టులు నిల్

ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని భారత వ్యవసాయ పరిశోధన మండలితో పనులుంటాయి. అక్కడ నుంచే నిధులు వస్తుంటాయి. ప్రాజెక్ట్‌లు మంజూరవుతాయి. గడచిన ఐదేళ్లలో పెద్దగా ప్రాజెక్ట్‌లు మంజూరైన దాఖలాలు లేవు. నామమాత్రపు నిధులను మాత్రమే వ్యవసాయ పరిశోధన మండలి నుంచి రప్పించగలిగారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అయితే రాష్ట్రంలో కొత్త పరిశోధనా స్థానాలను ఏర్పాటు చేశారు. ఉద్యాన కళాశాలలు నెలకొల్పారు. పాలకమండలి ప్రతి మూడు నెలలకు ఒకసారి విశ్వవిద్యాలయంలో సమావేశం అయ్యేది. అభివృద్ధిపై చర్చించేది. ఆ రోజుల్లో అభివృద్ధి చేసిన ప్రాజెక్ట్‌లను కూడా సవ్యంగా వినియోగించుకోలేని స్థితికి ఉద్యాన విశ్వవిద్యాలయం దిగజారింది. వర్సిటీ పాలకులు సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేసుకున్నారు. గతేడాది నుంచి పాలన పూర్తిగా గాడి తప్పింది. చివరకు విశ్వవిద్యాలయానికి గడచిన ఐదేళ్లు చీకటి రోజులుగానే మిగిలాయి. ప్రభుత్వం రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. వాటిలో వైఎస్ ఛాన్సలర్‌లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వెంకట్రామన్నగూడెం విశ్వవిద్యాలయం వేరు. హైకోర్టు ఇక్కడ వీసీని తప్పించింది. నియామకాన్నే రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్‌ను నియమిస్తారని అంతా భావించారు. కానీ ప్రభుత్వం నియామకం చేపట్టలేదు. గడచిన వారం రోజులనుంచి ఫైళ్లు కదలడం లేదు. పాలన స్తంభించి పోయింది. పరిశోధనా స్థానాల్లోనూ పాలన సవ్యంగా సాగాలంటే వీసీని త్వరితగతిన నియమించాలి. లేదంటే ఇబ్బందులు తప్పవంటూ విశ్వవిద్యాలయ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.



ఇప్పటి వరకు ముగ్గురే రెగ్యులర్ వీసీలు

ఉద్యాన విశ్వవిద్యాలయం 2007లో ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇద్దరు మాత్రమే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌లుగా పనిచేశారు. తొలిసారిగా డాక్టర్ ఎస్‌డీ శిఖామణి వ్యవహరించారు. ఆ తర్వాత డాక్టర్ బీఎంసీ రెడ్డి రెండో వైస్‌ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ జానకి రామ్‌ను నియమించడమే కాకుండా రెండోసారి పొడిగించారు. అంటే 16 ఏళ్ల శ్వవిద్యాలయ చరిత్రలో కేవలం ముగ్గురు మాత్రమే రెగ్యులర్ వీసీలు. మిగిలిన వారంతా ఇన్‌ఛార్జ్‌లే. మూడేళ్ల కాలానికి మాత్రమే వైస్‌ఛాన్సలర్ ఉంటారు. అనంతరం ఆయన పదవీ కాలం పూర్తవుతుంది. అంటే దాదాపు 10 ఏళ్లు వరకు ముగ్గురు రెగ్యులర్ వైస్‌ఛాన్సలర్ పాలించారు. మిగిలిన ఆరేళ్లు పాటు ఇన్‌ఛార్జిలే ఉన్నారు. డాక్టర్ శిఖామణి,. డాక్టర్ బిఎంసి రెడ్డి హయాంలో విశ్వవిద్యాలయం ఒక వెలుగు వెలిగింది. అభివృద్ధి పథంలో పయనించింది. మళ్లీ ఉద్యాన విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం రావాలంటే అనుభవజ్ఞులను వైస్ ఛాన్సలర్‌గా నియమించాలి.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలి

డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ నాగరాణి



భీమవనం టౌన్, జూలై 19 : జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేసి మరింత విస్తృత పరచాలన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలి. జిల్లాలో గుర్తించిన 45 ప్రమాదకర పరిశ్రమలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పాలసీ కింద 2023 నవంబర్ 24 నుంచి ఈ ఏడాది జూలై 18 వరకు అందిన 171 దరఖాస్తుల్లో 164 దరఖాస్తులను ఆమోదించగా, మూడు దరఖాస్తులను తిరస్కరించగా ఇంకా మిగిలిన నాలుగు దరఖాస్తులను పరిశీలించి ఆమోదించాల్సి ఉంది.జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎం.మంగపతిరావు, వివిధశాఖల అధికారులు కె.గంగాధర్, ప్రసాద్, నాగేంద్ర ప్రసాద్, కె.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, శోభారాణి, రామకృష్ణ, అహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మాధవాయిపాలెం రేవు పాట రద్దు

నరసాపురం రూరల్, జూలై 19: మాధవాయిపాలెం- సఖినేటిపల్లి రేవు పాట ఈనెల 21న జరగాల్సిన నేపథ్యంలో రద్దు చేస్తున్నట్టు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈనెల 8న మూడో సారి టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. పాట ప్రారంభ ధర రూ 3.61 కోట్లుగా నిర్ణయించారు. పాటదారులెవ్వరూ శుక్రవారం సాయంత్రానికి ఒక్క షెడ్యూల్ కొనుగోలు చేయలేదు. దీంతో పాటను రద్దు చేశారు. ప్రారంభ ధర తగ్గించి తిరిగి పాట ఎప్పుడు నిర్వహించాలన్నది త్వరలో ప్రకటిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు.

రేపటి నుంచి నరసాపురం-డోన్ రైలు పునరుద్ధరణ

నరసాపురం, జూలై 19: నరసాపురం- డోన్‌ల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 21 నుంచి పునరుద్ధరిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాక్ మరమ్మతు పనులు కారణంగా ఈ రైలును మూడు నెలలుగా నిలిపివేశారు. 17282 నంబర్‌తో ఈ రైలు నరసాపురంలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరి విజయవాడ-గుంటూరు మార్కాపురం, నంద్యాల మీదుగా రాత్రి తొమ్మిది గంటలకు డోన్ చేరుకుంటుంది. జిల్లా నుంచి శ్రీశైలం వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మార్కాపురంలో దిగి అక్కడ నుంచి బస్సు మార్గంలో శ్రీశైలం వెళుతుంటారు. కర్నూల్, నంద్యాల వెళ్లే జిల్లా ప్రయాణికులు ఈ రైలునే ఆశ్రయిస్తారు.

ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో

రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు

ఉండి జూలై 19: జిల్లాలోని రెండు ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో 2024-25విద్యా సంవత్సరంనకు రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఉండి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24 సాయంత్రం ఐదు గంటల లోపు ఆనెలైన్‌లో పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేయించుకుని తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ ఉండి 08816-297093, 96760 99988 నంబర్లలో సంప్రదించాలని కోరారు. పదో తరగతి ఫెయిలైన వారికి వెల్డర్ ఒక ఏడాది ట్రేడ్ నందు అవకాశం కలదని ప్రిన్సిపాల్ తెలిపారు.





వెంకచేజెర్ల శ్రీనివాస్, మరుముకం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు బాండులు అందజేస్తున్న అధికారులు

శ్రీవారి ట్రస్టుకు రూ.4.28 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, జూలై 19: చిన వెంకన్న నిత్యాన్నదాన ట్రస్టునకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా రూ.4.28 లక్షలను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఏలూరు సమీపంలోని పినకడిమికి చెందిన వెంకచేజెర్ల శ్రీనివాస్ రూ.3.12 లక్షలు. కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన మరుముకం శ్రీనివాస్ మరో రూ.1.16లక్షలు మొత్తం రూ.4.28 లక్షలు నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. వారికి స్వామి వారి దర్శన అనంతరం సూపరింటెండెంట్ నరసింహరాజు బాండు పత్రాలను అందించారు.

వీడని ఎంపీడీవో అదృశ్యం మిస్టరీ

- కొనసాగుతున్న గాలింపు
- నరసాపురంలో కృష్ణా జిల్లా పోలీసులు విచారణ
- మాజీ ఎమ్మెల్యే ముదునూరిని కేసులో ఇరికించేందుకు కుట్ర
- వైసీపీ నాయకుల ఆరోపణ



ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేస్తున్న సీఐ బాషా

నరసాపురం రూరల్, జూలై 19: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం ఇంకా మిస్టరీగానే మిగిలింది. శుక్రవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ చిక్కలేదు. విజయవాడ పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతైన విచారణ చేపట్టారు. మరో వైపు ఈకేసు మిస్టరీగా మారింది. ఎంపీడీవోకు ఫోన్ చేసి బెదిరించి ఎకౌంట్‌లోకి లక్షలాది రూపాయలు బదిలీ చేయించుకున్నది ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. ప్రస్తుతం దీనిపైనే ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటు పోలీసులు కూడా ఈ చిక్కుముడిని ఛేదించేందుకు కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

కృష్ణా జిల్లా పోలీసుల విచారణ

మరోవైపు కృష్ణా జిల్లా పోలీసులు విచారణ నిమిత్తం నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో విచారణ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. వివరాలను ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, ఎంపీపీ సోని, సిబ్బంది నుంచి ఆరా తీశారు. ఆయనకు ఫోన్‌లు ఎక్కడ నుంచి వచ్చేవి, ఆర్థిక పరిస్థితి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాకీ ఎప్పటి నుంచి కట్టాల్సి ఉంది, దానికి సంబంధించి పాటదారుడికి ఎంపీడీవో వెంకటరమణ ఇచ్చిన నోటీసులను పరిశీలించారు. విచారణలో స్థానిక సీఐ స్వామి పాల్గొన్నారు.

ఈ కేసును రాజకీయం చేస్తున్నారు..

అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని వైసీపీ నాయకుల డిమాండ్

ఎంపీడీవో అదృశ్యంపై తమ పార్టీ నేతలపై వస్తున్న ఆరోపణలపై వైసీపీ నాయకులు శుక్రవారం స్పందించారు. పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎంపీపీ సోని, సీనియర్ నాయకులు వైకేఎస్, కామన బుజ్జి, షేక్ బుల్లిమస్తాన్ విలేకర్లతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే ముదునూరిని ఇరికించేందుకు టీడీపీ, జనసేన పార్టీలు కుట్ర చేస్తున్నాయన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఎంపీడీవో వెంకటరమణ బాధ్యతలు చేపట్టారన్నారు. ఈ కారణంగా ఒక్కసారి కూడా రేవుకు సంబంధించిన బకాయిల కోసం ఫోన్ చేయలేదని.. అవసరమైతే ముదునూరి కాల్ డేటాను పరిశీలించుకోవచ్చన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో విచారించాలని డిమాండ్ చేశారు. పాటదారుడు ధవేజీ త్వరలో ఈ సొమ్మును చెల్లిస్తారని, అతడి పంటు ప్రభుత్వ ఆధీనంలోనే ఉందన్నారు. నిజాయతీపరుడైన ఎంపీడీవో క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నామన్నారు. సమావేశంలో పీడీ రాజు, జయ, మురళీ, శంకర్ తదితరలుఉ పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి జలాలు

- భద్రాచలం వద్ద 27.50 అడుగులకు చేరిన నీటిమట్టం
- స్పిల్వే నుంచి 3.60 లక్షల క్యూసెక్కులు విడుదల
- ధవళేశ్వరం నుంచి 3.46 లక్షల క్యూసెక్కులు విడుదల

పోలవరం/ కుక్కునూరు/ఏలూరు క్రైం/ఏలూరు సిటీ జూలై 19 : ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి వరద పెరుగుతోంది. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి అక్కడ గోదావరి నీటిమట్టం 27.50 అడుగులకు చేరుకుంది. రాత్రికి 30 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని తెలంగాణ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని కుక్కునూరు తహసీల్దార్ కోరారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 3,60,021 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 3.46 లక్షల క్యూసెక్కుల వరద జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి మరో ఐదు లక్షల క్యూసెక్కుల జలాలు రానున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఎగువ కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ లెవెల్ పెరిగి కాఫర్ డ్యాంకి సమీపంలో వున్న గండి పోశమ్మ ఆలయంలోకి వరద జలాలు ప్రవేశించాయి. అధికారులు ఆలయానికి రాకపోకలు నిలిపివేశారు.



పోలవరంలో గండి పోశమ్మ ఆలయంలోకి చేరిన వరద నీరు

పోలీస్‌శాఖ అప్రమత్తం

వాతావరణంలోని పెనుమార్పుల వల్ల జిల్లాలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో గోదావరి నదీపరివాహక ప్రాంతాలు, కాల్వలు, వంకలు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. జిల్లాలోని కొన్ని గ్రామాలకు వెళ్లే మార్గాలు కూడా వరదలతో సంబంధాలు తెగిపో యాయి. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ శుక్రవారం మేడేపల్లి, వసంతవాడ, గొల్లవాయి, కుమ్మరిగూడెం, అల్లూరి నగర్‌లలో పోలీసు అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ ప్రజల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గత వరదల సమయంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రహదారులపై ఎక్కడైనా చెట్ల కొమ్మలు పడిపోయి ట్రాఫిక్‌నకు అంతరాయం కల్గిస్తే తక్షణం వాటిని తొలగించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మరోవైపు తమ్మిలేరు కాల్వకు వరద రావడంతో ఇప్పటికే ఏలూరు నగరంలో రెండు పాయలుగా చీలిపోయిన ప్రాంతాలను సంబంధిత స్టేషన్‌పరిధిలోని అధికారులు పరిశీలిం చారు. తూర్పు లాకుల ప్రాంతం, తంగెళ్ళమూడి బ్రిడ్జి, శనివారపు పేట లోబ్రిడ్జిలను అధికారులు పరిశీలించారు. ఒకవేళ శనివారపుపేటలో బ్రిడ్జిపై నీరు ప్రవహించే అవకాశం ఉంటే రెండువైపులా మార్గాన్ని మూసి వేయడానికి పోలీసులు ముందస్తుగా స్టాపర్లను సిద్ధం చేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా చర్యలు చేప ట్టింది.

ఆ రెండు మండలాల్లో గర్భిణుల తరలింపు

ఏలూరు జిల్లాలో ఆకస్మిక వరదల ధాటికి కుదేలవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం 14 మంది గర్భిణులను సమీప మండలాల్లోని పీహెచ్‌సీలకు తరలించి పర్యవేక్షిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ వెల్లడించారు. వీరిలో 11 మంది ఆగస్టులో డెలివరీ అయ్యే అవకాశాలున్న గర్భిణులను శనివారం జంగారెడ్డిగూడెం సీహెచ్‌సీకి తరలిస్తామన్నారు. అన్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, వర్షాలు తగ్గిన వెంటనే అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా పంచాయతీరాజ్‌శాఖను సమన్వయం చేసుకుని సేవలు అందిస్తామన్నారు. వేలేరుపాడు మండలానికి చెందిన సునీత అనే గర్భిణిని, మరో తొమ్మిది నెలలు నిండిన గర్భిణిని అంబులెన్సు ద్వారా వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మావతి తెలిపారు. మండలంలోని 12 నివాసిత ప్రాంతాల్లోని 31 మంది గర్భిణులను, 27 మంది బాలింతలను గుర్తించామని వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.



శిశువుకు జన్మనిచ్చిన రామవరం మహిళ

చిన్నారికి జన్మనిచ్చిన రామవరం మహిళ

ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో పెదవాగు పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన రామవరం గ్రామానికి చెందిన గర్భినిని వేలేరుపాడు పీహెచ్‌సీకి తరలించగా శిశువుకు జన్మనిచ్చింది. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అగత, ఏఎన్ఎం ఎస్తేరు మాట్లాడుతూ తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.





వేలేరుపాడు పీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది.. పీహెచ్‌సీలో గర్భిణులు

ముంపు చేలకు సస్యరక్షణ సూచనలు

- పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



మొగల్లు శివారు నారుమళ్లలో నిలిచిన నీరు

భీమవరం రూరల్, జూలై 19 : ముంపునకు గురైన నారుమడులు, నాట్లు వేసిన చేలకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. నారుమడి దశలో ఉన్న వరి పంట విత్తనం చల్లి 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే మొలక శాతం బాగా తగ్గుతుంది. కాబట్టి రైతులు ఈ దశలో వీలైనంత త్వరగా నీళ్ల పూర్తిగా బయట తీసివేయాలి. నారుమడి ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బ తినే అవకాశం ఉంది. నీట మునిగిన ఐదు రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. తర్వాత ఐదు సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేసేందుకు అందివస్తుంది. వర్షాల వల్ల నారుమడిలో తెగుళ్ళు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. నీటిని పూర్తిగా బయటకు తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత తెగుళ్ల నివారణకు ఒకటి లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెట్ మిశ్రమం ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

ఊడ్చిన చేలలో..

ఊడ్చిన చేలో నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయాలి. వరి పూర్తిగా కోలుకున్న తరువాత మాగుడు తెగులు, ఇతర కుళ్ల సోకకుండా ఒకటి లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెట్ మిశ్రమం ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

వెదజల్లిన చేలలో..

విత్తనం చల్లిన వెంటనే అధిక వర్షాల వల్ల విత్తనాలు కుప్పగా చేరి గింజలు లోతుగా వెళ్లి పైన మట్టి కప్పబడడం వల్ల నీరు తీయలేని పరిస్థితుల్లో మొలక శాతం దెబ్బ తింటుంది. వర్షాలు తగ్గిన వెంటనే నీటిని పూర్తిగా బయటకు తీయాలి. విత్తనం 10 నుంచి 30 రోజుల లోపు ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే వరి దెబ్బతినే అవకాశం ఉంది. నీట మునిగిన ఐదు రోజుల్లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి.



జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి ఎలుకల కాల్వ వద్ద కొట్టుకు పోయిన కల్వర్టు

వేడుకగా వందేళ్ల గంధర్వ మహల్ ఉత్సవాలు

ఆచంట, జూలై 19 : ఆచంటలో వందేళ్ల క్రితం గొడవర్తి వారి కుటుంబ సభ్యులు నిర్మించిన గంధర్వ మహల్ నేటికీ చెక్కు చెదరకుండా ఉండడం అనేది భవనం విశిష్టతకు నిదర్శనమని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంటకు చెందిన గొడవర్తి నాగేశ్వరరావు నిర్మించిన గంధర్వ మహల్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వేడుకగా ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పితాని శిలాఫలకం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పూర్వపు రోజుల్లో పెద్ద కుటుంబాల వారు ఇటువంటి భవనాలు నిర్మించేవారని వందేళ్ల అనంతరం మళ్లీ ఆ భవనానికి ప్రారంభోత్సవం చేయడం మంచి కార్యక్రమం అన్నారు. రానున్న రోజుల్లో కుటుంబ సభ్యులందరూ మంచి ఆయురారోగ్యాలతో రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దీవించారు. అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకుడు గంధర్వ మహల్ కుటుంబ సభ్యుడు గొడవర్తి శ్రీరాములు జన్మదిన వేడుకలు కూడా పితాని ఆధ్వర్యంలో నిర్వహించారు. మహల్ ఎదుట పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహల్ కుటుంబ సభ్యులైన గొడవర్తి శ్రీరాములు, విద్యా సాగర్, నాగేశ్వరరావు, గొడవర్తి వెంకన్నబాబుతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



గంధర్వ మహల్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

జేఎన్టీయూకే అభివృద్ధికి కృషి చేస్తా..

- ఇన్‌చార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ మురళీకృష్ణ బాధ్యతలు



మురళీకృష్ణను అభినందిస్తున్న మాజీ వీసీ ప్రసాదరాజు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

జేఎన్‌టీయూ, జూలై 19: కాకినాడ జేఎన్టీయూకే అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతోపాటు కాలానుగుణంగా ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులను అనుసరించి బోధన ఉండేలా ప్రణాళిక చేపడతామన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్‌గౌర్, ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఉపకులపతులు, వర్సిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాద రాజు, శ్రీనివాసకుమార్, పద్మరాజు, రిజిస్ట్రార్ సుమలత, మాజీ రిజిస్ట్రార్‌లతో ఇన్‌ఛార్జి వీసీ సమావేశం నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఆల్‌టైమ్ రికార్డు ధర రూ.389



జంగారెడ్డిగూడెం, జూలై 19 : వర్జీనియా పొగాకు ధరలు రోజురోజుకు పైపైకి పెరుగుతుండడంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. శుక్రవారం పట్టణంలోని 32వ ఆక్షన్ ప్లాట్ ఫారంలో కిలో పొగాకు ధర రూ. 389కి చేరింది. మరో ప్లాట్ ఫారం 18లో కిలో పొగాకు ధర రూ.388కి చేరింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మునుపెన్నడూ వర్జీనియా పొగాకుకు ఇంతటి ధర రాలేదని ఇది ఆల్‌టైమ్ రికార్డు ధర అని వేలం అధికారులు తెలిపారు.

నకిలీ యాప్‌తో భారీ స్కాం !

- సుమారు రూ.50 లక్షల వరకు నష్టపోయిన బాధితులు

భీమవరం క్రైం, జూలై 19: ఆన్‌లైన్‌లో యాప్‌ల ద్వారా సులభంగా డబ్బు సంపాదించవచ్చుననే ఆశతో చాలా మంది మోసపోతూనే ఉన్నారు. అలాంటి సంఘటన భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో ఎస్ఎంవో అనే పేరుతో ఒక యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో వచ్చిందని, అది కూడా ఒక జాతీయ బ్యాంకు నమూనాతో ఉన్న కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో ఉంచడంతో అది డౌన్‌లోడ్ చేసుకుని చాలా మంది డబ్బు చెల్లించారు. అత్యధిక వడ్డీ వస్తుందన్న నమ్మకంతో లక్షల్లో కూడా డబ్బులు పెట్టుబడులు పెట్టారు. దానితో పాటు శ్యామ్‌సంగ్ మరికొన్ని బ్రాండ్‌లు కూడా అందులో చూపించారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.50 లక్షలు వరకు యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టామని బాధితులు చెబుతున్నారు. జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురంతో పాటు ఏలూరు, కాకినాడ జిల్లాల్లో కూడా బాధితులు ఉన్నట్టు చెబుతున్నారు. దీనిపై భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు తీసుకుని వివరాలు సేకరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఆర్టీసీకి ఏమైంది ?

- వాహనాల అతి వేగమా.. డ్రైవర్‌ల నిర్లక్ష్యమా.. ?
- నెల రోజుల్లో తాడేరులో మూడు ప్రమాదాలు

భీమవరం రూరల్, జూలై 19 : ఆర్టీసీకి ఏమైంది.. నెల రోజుల్లోనే భీమవరం మండలం తాడేరు గ్రామంలో మూడు ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదాలన్నింటిలో ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. దీనికి ఇరు వాహనాల వేగం కారణమా.. ? డ్రైవర్ల నిర్లక్ష్యమా తెలియడం లేదు. గ్రామస్తులకు ఈ ప్రమాదాలు చర్చనీయాంశంగా మారింది. 25 రోజుల క్రితం తాడేరు గ్రామంలో ఆర్టీసీ బస్సు కింద ఒక యువకుడు మోటార్‌సైకిల్ మీద వెళ్తూ పడి చనిపోయాడు. వారం రోజుల కిందట ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. వెనుక భాగం తగలడంతో ప్రమాదం జరగలేదు. శుక్రవారం అదే ప్రదేశంలో ఆర్టీసీ బస్సు, మిని లారీ గట్టిగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మిని లారీ డ్రైవర్‌కు కాలు ఫ్రాక్చర్ అయ్యింది. లారీ ఎదుట భాగం దెబ్బతింది. ఈవిధంగా ప్రమాదాలు జరగడం ఆ ప్రాంతవాసుల్లో భయం నెలకొంది.



వారం రోజుల క్రితం లారీ ఆర్టీసీ బస్సు ఢీకొన్న దృశ్యం



శుక్రవారం మిని లారీ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో దెబ్బతిన్న ముందు భాగం

ఆగస్టు 30 వరకు భీమడోలులో 'రాయగడ' ఆగదు



భీమడోలు, జూలై 19 : రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల నేపథ్యంలో భీమడోలు రైల్వే స్టేషన్‌లో నిలిచే గుంటూరు, రాయగడ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఆగస్టు 30 వరకూ రాకపోకలు నిలిపి వేసినట్టు భీమడోలు రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్ మరమ్మతులు నేపథ్యంలో కొన్ని నెలలుగా సుమారు 15 రైళ్ల రాకపోకలు నిలిపి వేస్తున్నట్టు తెలిసిందే. ఈ నేపథ్యంలో భీమడోలులో నిలిచే రాయగడ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కూడా ఆగస్టు 30 వరకు ఆగవని అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

చిన్నారిని కొట్టి చంపిన కానిస్టేబుల్ అరెస్ట్

లింగపాలెం, జూలై 19 : కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు నెలల చిన్నారిని కొట్టి చంపిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎం.సుధాకర్, ఎస్ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. తొమ్మండ్రుగూడెంకు చెందిన దివ్యను ప్రేమవివాహం చేసుకున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ చెల్లాపాటి బాలాజీ కొన్నేళ్లుగా భార్యతో గొడవలు పడుతున్నాడు. విడాకుల కోసం దరఖాస్తు చేసుకుని గతవారం కోర్టు వాయిదా నిమిత్తం ఏలూరు న్యాయస్థానానికి వెళ్లివస్తుండగా భార్య, మామతో గొడవపడ్డాడు. అనంతరం తొమ్మండ్రుగూడెంలోని ఇంటికి వెళ్లి అక్కడ అత్తామరదళ్లపై దాడి చేశాడు. ఆవేశంలో రెండునెలల చిన్నారిపై వెదురుకర్రతో కొట్టడంతో ఆ చిన్నారి మరణానికి కారణమైన అతడిని ఏలూరులో అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ముద్దాయికి ఆరునెలల జైలు

నరసాపురం/యలమంచిలి,జూలై 19 : దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్షను నరసాపురం ఏజేఎఫ్‌సీఎం జడ్జి ఆర్. వరలక్ష్మి శుక్రవారం విధించారు. ఈ ఘటనకు సంబంధించి కోర్టు లైజన్ ఏఎస్ఐ ఉదయ భాస్కరరావు తెలిపిన వివరాలివి.. యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన జద్దు శ్రీనివాసరావు తన తల్లికి వైద్యం నిమిత్తం 2023 డిసెంబరు పదో తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి అదేనెల 15వ తేదీన ఇంటికి వచ్చే సరికి ఇంటి వెనక గుమ్మం తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి ఇల్లును పరిశీలించగా ఇంటిలో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు తస్కరించినట్టు గుర్తించి యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేరంపై యలమంచిలి ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు కేసు నమోదుచేయగా ఎస్ఐ కె.శివన్నారాయణ క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ నివేదిక ఆధారంగా పూలపల్లిలో నివాసం ఉంటున్న వీరవాసరం మండలం బొబ్బనపల్లికి చెందిన కట్టా సుబ్బారావు దొంగిలించినట్టుగా గుర్తించి బంగారం, వెండి వస్తువులు రికవరీ చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు. కోర్టు సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో ముద్దాయి సుబ్బారావుకు ఆరు నెలలు జైలు శిక్షను న్యాయమూర్తి వరలక్ష్మి విధించారు. కోర్టు కానిస్టేబుల్ అశోక్ సాక్షులను కోర్టులో హాజరుపరచగా ఏపీపీ ఎంఏ అమీద్ వాదనలు వినిపించారు.

బియ్యం వ్యాపారి అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, జూలై 19 : బాకీల వసూలు నిమిత్తం వెళ్లిన బియ్యం వ్యాపారి గొంట్ల వెంకటనారాయణ(52) మృతదేహం లభ్యమైంది. వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. స్థానిక 18వ వార్డుకు చెందిన గొంట్ల వెంకట నారాయణ స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. బాకీల వసూళ్ల నిమిత్తం భీమవరం మండలంలోని పలు గ్రామాలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం బాకీలు నిమిత్తం వెళ్లి తిరిగిరాలేదు. భార్య నారాయణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నాగిడిపాలెం గ్రామం వద్ద ఉప్పుటేరులో అతడి మృతదేహాన్ని కనుగొన్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి జూలై 19: ఉండి మండలం అర్తమూరు శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని పోలీసులు శుక్రవారం తెలిపారు. అర్తమూరు శివారు కవిటంపాకల గ్రామంలోని తల్లికోడు వద్ద గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వయసు గల పురుషుడి మృతదేహం ఉందని స్థానిక వీఆర్‌వో శివరామకృష్ణంరాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మృతుడు నలుపు రంగు బనియన్ ధరించుకుని వున్నట్టు తెలిపారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

పాలకొల్లు అర్బన్, జూలై 10 : శిక్షణ తరగతుల్లో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పి శ్యామ్ సుందర్ అన్నారు. బీఆర్ఎంవీఎం హైస్కూల్లో జరుగుతున్న హెచ్ఎంల శిక్షణ కార్యక్రమాన్ని శ్యామ్ సుందర్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పాలకొల్లు ఎంఈవోలు జి వీరాస్వామి, ఆర్ఎన్ఎస్‌వీజీ శర్మ, మాస్టర్ ట్రెయినీలు లక్ష్మీనారాయణ, నరేష్, రాయపూడి భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంతో సమయం, సొమ్ము ఆదా

ఆకివీడు, జూలై 19 : సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో డ్రోన్ల వినియోగం ఎక్కువైందని ఎంఎస్‌డీఈ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ పి.చంద్ర మౌళి, డీఆర్‌డీఏ జిల్లా పీడీ పి.వేణుగోపాల్ అన్నారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్రోన్ల వినియోగంపై జిల్లాలోని డ్వాక్రా మహిళకు అవగాహన కల్పించారు. వరి పంటపై పురుగుల మందులు, ఎరువులు పిచికారి చేయడానికి, చేపలు, రొయ్యల చెరువుల్లో మందులు చల్లడానికి, చేపల, వ్యాధులను గుర్తించడానికి, వరిపంట ఎదుగుదలకు డ్రోన్లు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, డ్వాక్రా మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకొనే అవకాశం ఉందన్నారు. డ్రోన్లతో సమయం, సొమ్ములు ఆదా అవుతుందన్నారు.

వక్తృత్వ విజేతలకు బహుమతులు



పాలకొల్లు అర్బన్, జూలై 10 : సాహితీ సంస్థ హరివిల్లు ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిరంలో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత, నటుడు వాడ్రేవు సుందరరావు ముఖ్యవక్తగా విచ్చేశారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు వంగా నరసింహారావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకట రత్నం పాల్గొన్నారు. 6,7 తరగతులు విభాగంలో కర్రి లహరి (శిశుమందిరం, పాలకొల్లు) ఉనికెల భావన (పూలపల్లి హైస్కూల్), జోగి వెంకట సాయి అమృత వర్షిణి (ఉల్లంపర్రు) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. 8, 9, 10 తరగతులు విభాగంలో ఇంజరపు యశస్విని (విద్యాభవన్స్) తమనంపూడి కార్తికేయ (శిశుమందిరం), సూరావజ్జుల సాహితీ మధురిమ (ఆదిత్య, పాలకొల్లు) గెలుపొందారు. ఇంటర్, డిగ్రీ విభాగాల్లో ములపర్తి మున్నీజ్యోతిశ్రీ (సబితా జూనియర్ కళాశాల) ఇమ్మళరాజు మోక్షిత (విశ్వజూనియర్ కళాశాల), దుప్పన పూడి శ్రావణి (జూనియర్ కళాశాల, జిన్నూరు) గెలుపొందారు.

రామన్నపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు, జూలై 19: రామన్నపాలెం 2వ గ్రామ సచివాలయ పరిధి ఆకనవారితోటలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించారు. ఈ శిబిరంలో మొగల్తూరు ఆసుపత్రి వైద్యుడు దినేష్ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, లేవలేని పరిస్థితిలో ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు.

మత్స్యకారులకు జీవనభృతి కల్పించాలి

మొగల్తూరు, జూలై 19: నాలుగు రోజులుగా వేటకు వెళ్లని మత్స్యకారుల కుటుంబాలకు జీవనభృతి కల్పించాలని మండల టీడీపీ నాయకులు అంద్రాజు రామన్న, బస్వాని ఏడుకొండలు, బందన నాగార్జున, కొల్లాటి హరి కృష్ణ కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధిక వర్షాలు కారణంగా శివారు ప్రాంతాల్లోని డ్రెయిన్‌లు నీరు లాగడం లేదన్నారు. రామన్నపాలెం దర్బరేవు డ్రెయిన్‌లో యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక నీరు పారుదలకు పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగించి నీటి ప్రవాహనికి ఏర్పాట్లు చేస్తే వరి సాగుకు, చేపల చెరువులకు వేటాడే మత్స్యకారులకు ఉపయోగపడుతుందని వారు కోరారు.

వర్షాలపై కమిషనర్ సమీక్ష

భీమవరం టౌన్, జూలై 19 : యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో పట్టణంలో ఈ డ్రెయిన్ ద్వారా ముంపునకు గురయ్యే ప్రాంతాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల ఆదేశించారు. శుక్రవారం ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కమిషనర్ శ్యామల సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో నీటినిను ఇంజన్‌లద్వారా తోడించాలన్నారు. నందమూరు అక్విడెక్టు వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం వల్ల సంబంధిత ఇంజనీరింగ్ సెక్షన్ అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీమా చెక్కు అందజేత

ఉండి జూలై 19: ప్రమాదవశాత్తు గాయపడ్డ జనసేన నాయకుడు యర్రా ఆదినారాయణకు రూ.24వేల బీమా చెక్కును సర్పంచ్ యర్రా దుర్గారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు చేతుల మీదుగా అందించారు. ఉప్పులూరుకు చెందిన యర్రా ఆదినారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పార్టీలో క్రియాశీల సభ్యుడైన ఆదినారాయణకు బీమా చెక్కును అందించారు.

కొత్తకాయలతిప్ప అభివృద్ధికి సహకరిస్తా

మొగల్తూరు, జూలై 19: కొత్తకాయలతిప్ప గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు లక్కు శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని రైతులకు అనువుగా డ్రెయిన్ ప్రక్షాళన చేపడతామన్నారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు హాజరై కూటమి ప్రభుత్వంలో గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు.

ఆర్యవైశ్యసంఘ అధ్యక్షునిగా వెంకట రమణ




నూతన కార్యవర్గాన్ని సత్కరించిన దృశ్యం

భీమవరం టౌన్, జూలై 19 : జిల్లా ఆర్య వైశ్య సంఘ ఉపాధ్యక్షుడు పరుచూరి నాగేశ్వర రావు సమక్షంలో భీమవరం మండల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. నూతన అధ్యక్షునిగా కంచర్ల వెంకట రమణారావు (కొండ) ఎన్నికయ్యారు. ఆయనతోపాటుగా కార్యదర్శిగా అనంతపల్లి నాగ వెంకట చలపతి, కోశాధికారిగా చక్కా శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బ్రిడ్జిపై గోతులు పూడ్చరూ..

పాలకోడేరు, జూలై 19: గొల్లలకోడేరు నుంచి పాలకోడేరు వెళ్ళే యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జిపై గోతులు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ బ్రిడ్జి ఇటూ భీమవరం వచ్చేందుకు, అటు తణుకు, వేండ్ర, నౌడూరు మీదుగా మార్టేరు వెళ్ళేందుకు ఇది ప్రధాన బ్రిడ్జిగా ఉంది. ఈ బ్రిడ్జిపై ప్రతీ రోజు వందలాది వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. ఈ బ్రిడ్జిపై కొంత కాలంగా గోతులు ఏర్పడ్డాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గోతులు మరింత పెద్దవిగా అయ్యి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిని కలుగుజేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఈ బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు లేకపోవడంతో ప్రయాణికులు గోతుల్లోపడిన సందర్భాలున్నాయి. పెద్ద పెద్ద గోతులు అవడంతో స్లాబ్ మీద ఉన్న ఊచలు సైతం బయటకు కనిపిస్తున్నాయి. బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిద్ధాంతం వద్ద గోదావరి ఉధృతి



పెనుగొండ, జూలై 19: గోదావరికి ఎగువ ప్రాంత ంలో కురుస్తున్న భారీ వర్షాలకు పెనుగొండ మండలం, సిద్ధాంతం వద్ద గోదావరి వరద ఉధృతంగా ఉన్నది. రెండు రోజులుగా 8 అడుగులు మేర పెరగడంతో లంక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది మరింత పెరుగుతుందని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో లంక భూముల్లో ఉన్న పాడి పశువులను తీసుకురావా లా.. వద్దా అనే ఆలోచనలో లంక రైతులు ఉన్నారు. ప్రస్తుతం లంకలో పండించే కూరగాయలను తీసుకువచ్చే పనిలో రైతులు నిమగ్నమై ఉన్నా రు. ఇదిలా ఉండగా అధికారులు సిద్ధాంతం గోదావరి రేవు వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

యలమంచిలి, జూలై 19: శిరగాలపల్లి గ్రామం రైతు సేవాకేంద్రం వద్ద శనివారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు యలమంచిలి పశువైద్యాధికారి డి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో ఎదకురాని పశువులు, చూడికట్టని పశువులు, చూడి పరీక్షలు, గర్భకోశవ్యాధులకు నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహిస్తారని, పశువులు, గొర్రెలు, కుక్కలకు టీకాలు వేస్తారని తెలిపారు.







మొగల్తూరు ఉన్నత పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు.. గొల్లలకోడేరులో మునిగిన రహదారి.. తణుకులోని కాలేజీలో కూలిన చెట్టు.. అధ్వానంగా యలమంచిలి-చించినాడ రహదారి

జనజీవనం అస్తవ్యస్తం

భారీ వర్షాలతో దినసరి కూలీలు, కార్మికుల వెతలు

రోడ్లపై మోకాలు లోతు నీరు.. పొంగుతున్న డ్రెయిన్లు.. మునిగిన చేలు

యలమంచిలి, జూలై 19: రెండురోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో నారుమడులు, నాట్లు వేసిన వరిచేలు ముంపుబారిన పడ్డాయి. చేలు వర్షపునీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. మురుగుకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని రహదారులు జలమయం అయ్యాయి. ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి, మేడపాడు-నేరేడుమిల్లి, మేడపాడు- పెనుమర్రు, యలమంచిలి- ఊటాడ, సీతమ్మచెరువు-కాంబోట్లపాలెం గ్రామాల మధ్య ప్రధాన రహదారుల గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు.

ఆకివీడు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో జగనన్న కాలనీ, జాతీయ రహదారి, సీసీ రోడ్లపై నీరు నిలిచింది. తాళ్ళకోడులోని జగనన్న కాలనీ రోడ్లపై వెళ్ళడానికి లేకుండా నీరు నిలవడంతో నివాసి తులు ఇబ్బందులు పడుతున్నారు. పల్లపు ప్రాంతవాసుల ఇళ్ళల్లోకి నీరు చేరుతుండడంతో గగ్గోలు పెడుతున్నారు. పంటలను కాపాడుకోవడం కోసం రైతులు ఇంజన్లు ఏర్పాటు చేసుకొని నీటిని బయటకు తోడుకుంటున్నారు. ఇప్పటికే అక్కడక్కడ వరి దెబ్బతింటుందని, మరో రెండు రోజులు ఇదే మాదిరిగా వర్షాలు పడితే వరి కుళ్ళి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, మాదివాడలోని పొలాలను వ్యవసాయాధికారి ప్రియాంక శుక్రవారం పరిశీలించారు.

పాలకోడేరు: కాల్వలు, పంటబోదెలు నిండుగా ప్రవహిస్తుండటంతో చేలల్లో వర్షపునీరు బయటకు వెళ్ళే పరిస్థితి లేక నారుమడులు మునిగితేలుతున్నాయి. అదే విధంగా మండలంలోని గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో ఉన్న రహదారులు వర్షపునీటికి కాల్వలను తలపిస్తున్నాయి.

నరసాపురం, రూరల్: భారీ వర్షాలకు నరసాపురం తీర ప్రాంతం అతలాకుతలమైంది. డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పంట చేలు చెరువుల్ని తలపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని రోడ్లు నీట మునిగాయి. వేసిన ఆకుమడులు నీట తేలాయి. వందలాది ఎకరాల్లో కూరగాయల తోటలు నాశనమయ్యాయి. ముంపుకు గురైన సరిపల్లి,వేములదీవి, లాకుపేట, చిట్టవరం, గొంది గ్రామాల్లో ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పర్యటించారు. ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని తక్షణం సర్వే చేసి నివేదిక అందించాలని వ్యవసాయశాఖ ఏడీఈ అనిల్‌కుమారిని ఆదేశించారు. పలు చోట్ల రైతులు మురికికాల్వల్లో పూడిక, పంట కాల్వల్లో తూడు, లాకులు రిపేర్లు చేయకపోవడం వల్లే వర్షాలకు చేలు నీట మునిగిపోతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

మొగల్తూరు: మండలంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు మండలంలో 74.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు, రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రులలో మునిగిన నారుమడులను ఏవో అబ్దుల్ రహీమ్ పరిశీలించారు. ఆకుమడుల్లో నీరు బయటకు వెళ్ళడం ఆలస్యమైతే వెద జల్లే పద్ధతిలో సాగు చేపట్టాలని సూచించారు. మొగల్తూరులోని ఉన్నత పాఠశాల ఆవరణ ఆట స్థలంలో వర్షం నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరులోని పెద్ద గొల్లగూడెం, స్టేషన్ రోడ్డు, కోట వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు, పేరుపాలెం గ్రామాల్లో రహదారులపై నీరు నిలవకుండా కచ్చాడ్రెయిన్‌లు ఆయా గ్రామ పంచాయతీలు తవ్వించారు.

ఆచంట: కుండపోత వర్షాలు కారణంగా పలు కాలనీలు నీట మునిగాయి. ఇప్పుడిప్పుడే వేసిన వరినాట్లు, నారుమడులు నీటమునిగాయి. నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు పరిశీలించారు. సుమారు 400 ఎకరాల్లో వరినాట్లు మునిగాయని 60 ఎకరాల్లో నారుమడులు నీట మునిగినట్లు తెలిపారు.

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు రూరల్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేట, వెలమగూడెం, కొత్తపేట కొత్తకాలనీ, క్రిస్టియన్‌పేట, రాజీవ్‌నగర్‌కాలనీ, షుగర్‌కాలనీ, చిత్రాయి చెరువుగట్టు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో వర్షానికి డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. పల్లపు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక ఇబ్బంది పడ్డారు. హమాలీలు పనుల్లేకపోవడంతో ఖాళీగా ఉండిపోయారు. మండలంలోని వరి పొలాలు నీట మునిగాయి. సగంచెరువు, గోరింటాడ, ఆగర్రు, ఆగర్తిపాలెం, లంకలకోడేరు, వెలివెల, దగ్గులూరు, ఎస్ చిక్కాల, బల్లిపాడు తదితర గ్రామాల్లో వరి నారుమడులను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అడ్డాల పార్వతి, ఏవో కె రాజశేఖర్ పరిశీలించారు. నారుమడులు, వరి చేలు ముంపునకు గురైన భూముల వద్ద రైతులతో మాట్లాడారు.

పోడూరు: వర్షాలకు వరినాట్లు, ఆకుమడులు నీటమునిగాయి. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ పెనుమదంలో ముంపుప్రాంతాల్లో పర్యటించారు. నీటమునిగిన వరినాట్లు, ఆకుమడులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీరు మళ్లించి వరినాట్లు రక్షించేందుకు రైతులకు సూచనలు చేశారు. మండలంలో 350 ఎకరాల్లో వరినాట్లు, 50ఎకరాల్లో ఆకుమడులు నీటమునిగినట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి బిప్రసాదు, రైతులు ఉన్నారు.

పెనుగొండ: మండలంలో పంట పొలాలు రహదారులు ముంపు బారిన పడుతున్నాయి. వడలి, రామన్నపాలెం, దేవ, పెనుగొండ, ఇలపర్రు, ములపర్రు,నడిపూడి,చినమల్లం తదితర గ్రామాల్లో వరి నాట్లు వేసిన చేలు పూర్తిగా నీట మునిగాయి. మండలంలో పలు రహదారులు పాడైపోయాయి. శుక్రవారం ఈదురు గాలులకు దొంగరావిపాలెం జాతయ రహదారి పై కనకదుర్గమ్మ అలయం సమీపంలో భారీ వృక్షం పడిపోయింది. దీంతో కొంత మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందని తక్షణం హైవే పోలీసులు స్పందించి రహదారికి అడ్డంగా ఉన్న వృక్షాలను తొలగించారు.

పొంగుతున్న యనమదుర్రు డ్రెయిన్



భీమవరంలో రోడ్లపైకి చేరిన యనమదుర్రు వరద నీరు

గణపవరం, జూలై 19: యనమదుర్రు డ్రెయిన్ పొంగిపొర్లడంతో గణపవరం మండలం పిప్పరలోని లోతట్టు కాలనీ నీటిముంపునకు గురైంది. ప్రతీఏటా యనమదుర్రు వరదకు పిప్పరలోని కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతం ఈ వరదముంపునకు గురవుతుంది. గత వైసీపీ ప్రభుత్వం యనమదుర్రు డ్రెయిన్‌కు శిథిలమైన షట్టర్లను పునరుద్ధరించకపోవడంతో వరద ముంపునకు ఈ కాలనీ గురవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసు బాబు, స్థానిక గ్రామ పంచాయతీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి డ్రెయిన్ షట్టర్ వద్ద ఇసుక బస్తాలతో మూయించివేశారు. ముంపుకు గురైన కాలనీలో నీటిని ఇంజన్లతో బయటకు తోడుతున్నారు. యనమదుర్రు పరీవాహక ప్రాంతాలైన ఎస్.కొండేపాడు, కేశవరం, కోమర్రు, గ్రామాల ప్రజలు భయపడుతున్నారు.

భీమవరం టౌన్: యనమదుర్రు డ్రెయిన్ నీటి మట్టం పెరగటంతో పట్టణంలోని మెంటే వారితోట ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. అక్కడ నివసిస్తున్న ప్రజలు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇసుకబస్తాలను సిద్ధంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ శ్యామలకు సూచించారు. అప్రమత్తంగా ఉండి గట్టును జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

అత్తిలి: అత్తిలి మండలం తిరుపతిపురం వద్ద యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. డ్రెయిన్‌లో కలిసే ఆరుదలకోడు డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో తిరుపతిపురం పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆరుదలకోడ్ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని డ్రెయిన్ వెంబడి ఉన్న గ్రామాల వారు కోరుతున్నారు. వరద ఉధృతిని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు.

గణపవరం: భారీ వర్షాలకు గణపవరం మండలంలోని వరినాట్లు, నారుమడులు దెబ్బతిన్నాయి. శుక్రవారం మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్ ముంపు పొలాలను పరిశీలించారు. మండలంలో 11,713 ఎకరాల్లో సాగువిస్తీర్ణం ఉండగా 3,261ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. వర్షాలకు 984 ఎకరాలు నీటి ముంపునకు గురయ్యాయన్నారు.

తణుకు: చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల ప్రధాన గేటు పక్కనే ఉన్న భారీ వృక్షం వర్షాలకు నేలకొరిగింది. ఆ సమయంలో విద్యార్థుల రాకపోకలు లేకపోవడంతో ముప్పు తప్పింది. రాకపోకలకు అంతరాయం లేకుండా అధికారులు చెట్టు తొలగింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెంటపాడు: వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. చాలా గ్రామాల్లో వరిపొలాలు కాలువల్లా మారాయి. వర్షాలు ఇంకా రెండు రోజులు ఇలాగే ఉంటాయన్న వార్తలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరో వైపు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో ఏం జరుగుతుందోనని యనమదుర్రు డ్రైనేజీ సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అత్తిలి: తిరుపతిపురం ఆరుదల కోడ్ అవుట్ ఫాల్స్ స్లూయిస్‌ను జిల్లా కలెక్టర్ నాగరాణి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. అక్విడెక్ట్ వద్ద నీటి ప్రభావంతో ముంపునకు గురయ్యే పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. వంతెన వద్ద పూరి గుడిసెలలో ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. అనంతరం పింఛన్ అందక బాధపడుతున్న దివ్యాంగ బాలుడుతో మాట్లాడి త్వరలో పింఛన్ అందేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ పల్లపు ప్రాంతాల్లో ముంపునకు గురికాకుండా ఇసుక మాటలను తెప్పించి ముందస్తు చర్యలు చేపట్టారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువ వరదలకు నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెంలోని ముంపు గ్రామాలను శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి పరిశీలించారు. ఎర్రకాలువ వరద తీవ్రత అధికంగా ఉందని నష్టపరిహారం అందిస్తామని రైతులెవ్వరూ పంటల కోసం వరద ప్రాంతాలకు వెళ్ల వద్దన్నారు. జగన్నాథపురంలో ముంపుతో నిరాశ్రయులైన వారిని పునరావాస కేంద్రం వద్ద పరామర్శించి వారికి తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. మండలంలోని కడియద్దలో వర్షపునీటితో ప్రజలు ఇబ్బంది పడటంతో కూటమి నాయకులు ఎక్స్‌కవేటర్‌తో మురుగునీరు బయటకు వెళ్లే ఏర్పాటు చేశారు. దండగర్రలో వర్షాలకు విద్యుత్ సరఫరా లేక మంచినీరు అందక ప్రజలు ఇబ్బంది పడటంతో సర్పంచ్ పిల్లా రాంబాబు ఆధ్వర్యంలో జనరేటర్ వేసి మరీ మంచినీళ్లు అందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

పెంటపాడు, జూలై 19: ఎర్రకాలువ ఉధృతి నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం రామచంద్రపురంలో యనమదుర్రు డ్రెయిన్‌ను పరిశీలించి మాట్లాడుతూ అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






మాదివాడలో అమ్మవారికి ఆషాఢ సారె.. నరసాపురంలో పుంతల ముసలమ్మ.. పాలకొల్లులో ముఖదారమ్మకు శాకంబరి అలంకరణ.. మండపాకలో యల్లారమ్మకు ఎమ్మెల్యే ఆరిమిల్లి పూజలు

అమ్మవార్లకు శాకంబరి అలంకరణ

నరసాపురం టౌన్, జూలై 19: పట్టణంలోని రాయపేటలో పుంతల ముసలమ్మ అమ్మవారికి శుక్రవారం శాకంబరి అలంకరణ చేశారు. కూరగాయలను తీసుకొచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆషాఢ సారె

ఆకివీడు, జూలై 19 : ఆకివీడు భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆషాఢ సారెను శివకేశవ భజన మండలి సమర్పించారు. కార్యక్రమంలో మ హిళ భక్తులు ఉన్నారు.

శాకంబరిగా ముఖదారమ్మ

పాలకొల్లు అర్బన్, జూలై 10 : స్థానిక అచ్చుగట్లపాలెం (చిత్రాయి చెరువుగట్టున)లో ముఖదారమ్మ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు.



మావుళ్ళమ్మ ఆలయానికి బంగారం అందిస్తున్న దృశ్యం

ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. అదే విధంగా 24వ వార్డులోని శంబేశ్వర స్వామి ఆలయంలో రత్నమాంబ అమ్మవారిని శుక్రవారం వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీగా అలంకరించారు.

యల్లారమ్మకు ఎమ్మెల్యే పూజలు

తణుకు, జూలై 19: మండపాక యల్లారమ్మను శుక్రవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. ఆయనను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. ఆషాఢ మాసం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. టీడీపీ గ్రామ నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, పెండ్యాల భాస్కర రావు, పెండ్యాల యల్లపరాజు, ఆలపాటి శివరాం, మారం కోటేశ్వరరావు, ఈవో పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు బంగారం బహూకరణ

భీమవరం టౌన్, జూలై 19 : పట్టణానికి చెందిన టి.వెంకట సత్యనా రాయణ, పద్మావతి దంపతులు 20 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా మావుళ్ళమ్మ ఆలయానికి అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అమ్మవారి స్వర్ణ వస్త్రాన్ని పూర్తిచేస్తామని అన్నారు. ఇప్పటికే అమ్మవారి స్వర్ణ వస్త్రం 80 శాతం పూర్తి అయ్యిందని అన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో గ్రాడ్యుయేషన్ డే

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 19 : ఎస్ఆర్‌కేఆర్‌లో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడం అభినందించదగిన విషయమని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్‌డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా సాగి రామకృష్ణంరాజు 91వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు అధ్యక్షత వహించారు.

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవు

పాలకొల్లు అర్బన్, జూలై 19 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, గత ప్రభుత్వం మాదిరిగా కక్ష సాధింపు చర్యలు ఎంత మాత్రం ఉండవని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. అంగర తన నివాసంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తారని, అమరావతి నిర్మాణం, పోలవరం నిర్మాణాలను శరవేగం చేశారని అంగర అన్నారు. ప్రతిపక్షాలను వేధించడం, కక్ష సాధించడం చేయవద్దని చంద్రబాబు పార్టీ నాయకులను హెచ్చరించడం జరిగిన విషయం అందరికీ తెలుసునని అంగర అన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తున్నామని అంగర తెలిపారు. అంగర నివాసంలో రాష్ట్ర రజక సంఘం గౌరవాధ్యక్షుడు నడిపూడి సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గుగ్గిలపు రామకృష్ణ, పోదూరి సత్యనారాయణ తదితరులు కలిసి రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

వరద పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆచంట, జూలై 19: గోదావరికి వరద వస్తున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం సబ్ కలెక్టర్ అచ్యుత అంబరీష్ అన్నారు. శుక్రవారం కోడేరు వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. గోదావరి వరద పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని లంక వాసులు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రవాహం ఎక్కువ ఉన్నప్పుడు గోదావరిలో పడవలు రాకపోకలు కూడా నిరోధించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఐపీశెట్టి, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ ఉన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: ఎమ్మెల్యే రఘురామ

ఉండి జూలై 19:భారీ వర్షాలు కురుస్తున్నందున నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా వుండాలని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇనుప స్థంభాలను సిమెంట్ స్థంభాలను చెప్పులు లేకుండా వర్షంలో తడుస్తూ ముట్టుకోవద్దని సూచించారు. కరెంట్‌లైన్ కింద వున్న చెట్లను ముట్టుకోవద్దని సూచించారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం టౌన్, జూలై 19: తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు శుక్రవారం ప్రత్యేక బస్సును ఆర్టీసీ డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ బస్సు శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, 21న అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసుకుని తిరిగి 22న తాడేపల్లిగూడెం చేరుకుంటుందని డిపో మేనేజర్ వివరించారు. భీమవరంలో కూడా గిరి ప్రదక్షిణకు బస్సును ప్రారంభించారు.

స్టాంపుల కొరత నివారించాలి: ఐలు

తణుకు, జూలై 19: కోర్టు ఫీజు స్టాంపుల కొరతను నివారించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. కోర్టు స్టాంపులు లేక కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

పెంటపాడు, జూలై 19: బాల్య వివాహాలు నేరమని, కొత్త చట్టాలపై తల్లిదండ్రులంతా అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పడమర విప్పర్రులో బేటీ బచావో-బేటీకో పడావో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే బొలిశెట్టి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 19: ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ముదునూరు గ్రామస్థుడు భూసారపు సతీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. అతను జనసేన సభ్యత్వం కలిగి ఉండటంతో రూ. 2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద బాధితుడి కుటుంబీకులకు అందజేశారు. వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, బుద్దన నారాయణ, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే

అత్తిలి, జూలై 19: తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలతో కెఎస్ గట్టు గ్రామంలో అధిక వర్షాల కారణంగా ఎస్సీ ఏరియా, అంగన్‌వాడీ, పాఠశాలల్లో అత్తిలి ప్రభుత్వ ఆస్పత్రి ఫ్యామిలీ ఫిజిషియన్ ఆరోగ్య కార్యకర్తలతో కలసి ఆరోగ్య సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. డాక్టర్ కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

అత్తిలి, జూలై 19 : అత్తిలి జడ్పీ హైస్కూలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అత్తిలి సూపర్‌వైజర్ కె. కుమారి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేస్తే ఐసీడీఎస్ కార్యాలయాలకు, సమీప అంగన్‌వాడీ కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. సదస్సులో అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సచివాలయ సందర్శన

అత్తిలి, జూలై 19 : పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి అత్తిలి సచివాలయం -1ను సందర్శించారు. సచివాలయంలోని సిబ్బంది తమ విధులపై కలెక్టర్‌కు వివరించారు. అత్తిలి ఎంపీడీవో, మండల పరిపాలనాధికారి, అత్తిలి మండల విస్తరణాధికారి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.